క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు


ఆక్రమణలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు : స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్ బైపాస్ రోడ్డులోని కేబీఎస్ఆర్ కాలనీ అప్రూవల్ లేఅవుట్‌లో ఓపెన్ స్పేస్‌కు సంబంధించిన ఆక్రమణలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. ఏసీపీ నాగరాజు, టీపీఓ చంద్ర మోహన్ పర్యవేక్షణలో వీటిని తొలగించడం జరిగింది. నిబంధనలను ఎవరు ఉల్లంఘించినా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా యద్దారెడ్డి



బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పట్టణానికి చెందిన ఈ.వై.యద్దారెడ్డి నియమితులయ్యారు. ఈయన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉంటూ వస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో జేసీఎస్ కన్వీనర్‌గా పట్టణంలోని బూత్ కమిటీ మెంబర్లను సమన్వయ పరచడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం బూత్ కమిటీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో పార్టీ అప్పగించిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానని తెలిపారు. అలాగే తన నియామకానికి సహకరించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు మ్యూజికల్ నైట్‌లో పాల్గొంటే కేసు లేదా?

చాపాడు : తమన్ మ్యూజికల్ నైట్ పార్టీకి సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొంటే రాష్ట్ర ఎన్నికల సంఘానికి కనిపించలేదా అని ఏపీఎస్సార్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ప్రశ్నించారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు మ్యూజికల్ నైట్‌లో పాల్గొంటే కేసు నమోదు చేయరుకానీ, తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేయనప్పటికీ వైఎస్ జగన్ మిర్చి రైతులను పరామర్శించేందుకు వెళ్తే కేసు నమోదు చేయడం వింతగా ఉందన్నారు. పోలీస్ బందోబస్తు ఇవ్వకపోవడం, రూట్ క్లియర్ చేయకపోగా.. నిబంధనలు ఉల్లంఘించారంటూ కేసు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ ఘటనపై రైతులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం

మైదుకూరు : మత్తు పదార్థాలతో జీవితాలు నాశనమవుతాయని ప్రొద్దుటూరు ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి, మైదుకూరు అర్బన్ ఇన్‌స్పెక్టర్ హాసం పేర్కొన్నారు. స్థానిక మేధా డిఫెన్స్ అకాడమీలో యువత మేలుకో పేరుతో పోలీసు కళాజాత బృందం మత్తు పదార్థాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్తు పదార్థాలతో విద్యార్థుల చదువు, ఆరోగ్యంతోపాటు కుటుంబాలు కూడా దెబ్బతింటాయని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. పోలీసు కళాజాత బృందం మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై ప్రదర్శించిన లఘు నాటిక ఆలోచింపజేశాయి. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ సుబ్బారావు, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ అస్తవ్యస్తం

బ్రహ్మంగారిమఠం : అధికారుల పర్యవేక్షణాలోపంతో ఎరువుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాతకు అన్నీ కష్టాలే మిగిలాయి. బి.మఠం మండలంలో 14 గ్రామ సచివాలయాలున్నాయి. సచివాలయ వ్యవసాయ సహాయకులు ఎవరికి వారే అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయం తెరవకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు ఎరువుల కోసం ఎదురుచూశారు. మధ్యాహ్నం వరకూ ఏ అధికారి రాకపోవడంతో వెనుదిరిగారు. చౌదరవారిపల్లెలో కూటమి నాయకులు చెప్పిన వారికే ఎరువులు పంపిణీ చేశారనే ఆరోపణలున్నాయి. ఎనిమిది నెలల కాలంలో పంచాయతీకి ఏడు లారీల ఎరువులు రాగా, అర్హత లేని వారికి 50 నుంచి వంద బస్తాలు ఇచ్చినట్లు సమాచారం. పార్టీలకతీతంగా పంపిణీ చేయాల్సిన అధికారులు కొందరికే ఇవ్వడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కానపల్లె గ్రామంలో శుక్రవారం పెద్దమ్మతల్లి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వైభవంగా విగ్రహ పూజ నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో వేద పారాయణం, గోపూజ, యాగశాల ప్రదక్షణ, భూతబలి, గణపతి పూజ కార్యక్రమాలతోపాటు పుట్టమట్టి పూజ నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

వీరభద్రస్వామి సన్నిధిలో శివరాత్రి ఏర్పాట్లు

జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ


వీరభద్రస్వామి సన్నిధిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ

చాపాడు : మహాశివరాత్రిని పురస్కరించుకుని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం సన్నిధిలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జమ్మలమడుగు ఆర్డీఓ సాయిశ్రీ సూచించారు. అల్లాడుపల్లె వీరభద్రస్వామి సన్నిధిలో ఈ నెల 26, 27వ తేదీలలో నిర్వహించనున్న మహా శివరాత్రి ఏర్పాట్లను ఆర్డీఓ సాయిశ్రీ శుక్రవారం పరిశీలించారు. అనంతరం అధికార, ఉత్సవ నిర్వహణ కమిటీతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ నెల 26, 27వ తేదీలలో శివరాత్రి ఉత్సవాలకు వేలాది భక్తులు తరలివస్తారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దర్శన ఏర్పాట్లు, వాహనాల పార్కింగ్, నీటి వసతి, విద్యుద్దీపాలు, పారిశుద్ధ్య, పోలీస్ బందో బస్తు అంశాలపై ప్రత్యేక దృష్టి కేటాయించాలన్నారు. రెండు రోజుల పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచి సేవలందించాలని సూచించారు. దేవదాయశాఖ డీసీ మల్లికార్జున ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రమాకుమారి, ఎంపీడీఓ వీరకిషోర్, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఈఓ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెరుగు వీరనారాయణ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రం పరిశీలన

అట్లూరు : బద్వేలు వ్యవసాయ డివిజన్ పరిధిలోని బద్వేలు మండలం అబ్బుసాహెబ్‌పేట గ్రామంలో శుక్రవారం గోగుల రాధాకృష్ణయ్య ధన్వంతరి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం ఊటుకూరు ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, మొక్కల ప్రజ్వలన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడర్) బద్వేలు వ్యవసాయ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజుతో కలిసి సందర్శించారు. 7 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 7 సంవత్సరాలుగా దేశీ వరి రకాలు, కరివేపాకు, సజ్జ, వేరుశెనగ, నువ్వులు పూర్తిగా ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ సాగు చేయడం అభినందనీయమని వారు తెలిపారు. కాలాభ్, నవారా, బహురూపి, మాపులే సాంబ, చిట్టి ముత్యాలు వంటి దేశీ రకాలు సాగు చేస్తూ విత్తనం కూడా తోటి రైతులకు అందిస్తున్నారన్నారు. లింగాకర్షక బుట్టలు, పసుపు, తెలుపు పల్లాలు, వేప నూనె వాడకం, ఘన, ద్రవ జీవామృతం వాడకం ఈయనకు పరిపాటి అని, కషాయాల దుకాణం నిర్వహిస్తున్నారన్నారు.

పేదల గృహాలను కూల్చాలని చూస్తే తిరుగుబాటు తప్పదు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో గల ప్రభుత్వ స్థలాల్లో పేదలు వేసుకున్న గుడిసెలను తొలగించాలని చూస్తే తిరుగుబాటు తప్పదని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.వీరశేఖర్ హెచ్చరించారు. పట్టణంలోని భాకరాపేట, సి.కొత్తపల్లె ఏరియాలలో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాల్లో అధికారుల తీరును నిరసిస్తూ శుక్రవారం నుండి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది మంది నిరుపేదలు నివాసగృహాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంటే వారికి మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వ పెద్దలు, అధికార యంత్రాంగం ఆ దిశగా ఆలోచించకుండా గృహాలను కూల్చివేయాలని చూడటం సరికాదన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబించే ఏ ప్రభుత్వానికైనా ప్రజా తిరుగుబాటు తప్పదని అన్నారు.

22 నుంచి ప్రాజెక్టుల మహాసభలు

మైదుకూరు : తాగు, సాగునీటి ప్రాజెక్టులపై నిర్వహించే రెండు రోజుల మహా సభలను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఏవీ శివరాం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు షావలి కోరారు. విలేకరులతో వారు మాట్లాడుతూ కడప హరిత ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 22, 23వ తేదీల్లో ప్రాజెక్టుల మహా సభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమ, పశ్చిమ ప్రకాశం, ఉత్తర నెల్లూరు జిల్లాల్లోని తాగునీటి అవసరాలు, ప్రాజెక్టు పూర్తికి నిధుల కేటాయింపు, భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటారని వివరించారు. ఈ మహా సభలకు మేధావులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సర్వేకు సహకరించండి

పోరుమామిళ్ల : పి 4 సర్వేకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ రమణారెడ్డి శుక్రవారం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపడుతున్న పి 4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) సర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. శుక్రవారం రాజాసాహెబ్ పేటలో జరుగుతున్న సర్వేను ఆయన పరిశీలించారు. నిరుపేద ప్రజలకు, సామాజికంగా, ఆర్థికంగా బలోపేతమైన వ్యక్తుల నుంచి ఆర్థిక, మౌలిక సదుపాయాలు కల్పించడం సర్వే ఉద్దేశమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు యథాతథంగా కొనసాగుతాయన్నారు. ఎటువంటి అపోహలు పెట్టుకోకుండా అందరూ పి4 సర్వేకు సహకారం అందించాలని, సిబ్బంది ఇంటివద్దకు వచ్చినపుడు అందరూ సమాచారాన్ని ఇవ్వాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రముఖ డాక్టర్ హరీష్ కుమార్ తెలిపారు. పవర్ హౌస్ రోడ్డులోని గౌతం హైస్కూల్ 14వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ టి.సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు.

పశువైద్య విద్యార్థుల నిరసన

ప్రొద్దుటూరు రూరల్ : 19 రోజులుగా స్టైఫండ్ పెంచాలని సమ్మె చేస్తున్న పశువైద్య కళాశాల విద్యార్థులు శుక్రవారం మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాల ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించడంతోపాటు చెత్తను శుభ్రం చేశారు. ప్రభుత్వం స్పందించి స్టైఫండ్ పెంచాలని నినాదాలు చేశారు.

బీజేపీ మహిళా నాయకురాలిపై కేసు నమోదు

ఖాజీపేట :జిల్లా బీజేపీ మహిళా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవిపై ఖాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. తుడుమలదిన్నె గ్రామానికి చెందిన కుకట్ల పల్లి సునీలాకు, బీజేపీ నాయకురాలికి స్థల విషయంలో వివాదం ఉంది. రెవెన్యూ అధికారులు సర్వే చేసి వేసిన హద్దులను బీజేపీ నాయకురాలు తొలగించారు. అలాగే కులం పేరుతో తనను దూషించారని సునీలా పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు కేసు నమోదు చేశారు.

మంత్రి మండలి నిర్ణయాన్ని

ఉపసంహరించుకోవాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

బద్వేలు అర్బన్ : గత ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన ఆప్కాస్ సంస్థను రద్దు చేయాలని ఇటీవల జరిగిన మంత్రి మండలి సమావేశంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధకు యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ సంస్థ ఏర్పాటు కాకముందు ప్రతి సెక్షన్‌లో దళారీ వ్యవస్థ కొనసాగేదని, జీతభత్యాల చెల్లింపులు సైతం దళారీల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండేదని, ప్రతి నెల జీతాలు చెల్లించేవారు కాదన్నారు. 5 నుండి 6 నెలల జీతాలు బకాయిలు పెట్టడంతో పాటు జీతాలలో కూడా పెద్ద ఎత్తున కోతలు విధించి కార్మికులను దగా చేసేవారని అన్నారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తీసుకొచ్చిన ఆప్కాస్ వ్యవస్థ వీటన్నింటికి స్వస్తిపలికి కార్మికులకు సకాలంలో జీతాలు అందేవని అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ నెల 6న జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ సంస్థను రద్దు చేయనున్నట్లు ప్రకటించడం ద్వారా పారుగు సేవల కార్మికుల్లో భయాందోళనలు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడు శ్యాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షుడు శ్రీనువాసులు, కోశాధికారి శివకుమార్, కమిటీ సభ్యులు అచమ్మ, ఓబులమ్మ, ఆదిలక్ష్మి, సాయమ్మ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం


వధూవరులతో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

కలసపాడు : కలసపాడు ఉప సర్పంచ్ పులివీరారెడ్డి, వెంకటమ్మల కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి, శిరీష వివాహ వేడుక స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నంద్యాల మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథరెడ్డిలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అంకన గురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, సుదర్శన్, నారాయణ యాదవ్, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు హనుమంత రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ఎ.వి.భాస్కర్‌రెడ్డి, సింగరయ్య, రాంబాబు, నాగూర్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్–2 అభ్యర్థులకు న్యాయం చేయాలి


గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, గ్రూప్–2 అభ్యర్థులు

ప్రొద్దుటూరు : గ్రూప్–2 అభ్యర్థులకు న్యాయం చేయాలని స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో అభ్యర్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ మాట్లాడుతూ 899 గ్రూప్–2 పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో రోస్టర్ పాయింట్లలో లోపాలు ఉన్నాయని తెలిపారు. మెయిన్స్ పరీక్షకు సుమారు 92,250 మంది అభ్యర్థులు సిద్ధమవుతున్నారని, రోస్టర్ విధానంలోని లోపాలు సరిచేయకపోవడంతో లోపాలను సరిచేసి గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు ప్రభుత్వం, ఏపీపీఎస్సీ దృష్టికి తీసుకెళ్లారన్నారు. లోపాలను సరిచేయకుండానే ప్రభుత్వం ఈనెల 23న గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష నిర్వహించడం వల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. రోస్టర్ విధానంలో తప్పులు ఉండటం వల్ల గతంలో కోర్టుల తీర్పు ద్వారా కొన్ని రాష్ట్రాల్లో నోటిఫికేషన్లను రద్దు చేశారని గుర్తుచేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని రోస్టర్ పాయింట్లలో జరిగే తప్పులను సరిచేసి మెయిన్స్ పరీక్షలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయంత్, సురేష్, గ్రూప్–2 అభ్యర్థులు పాల్గొన్నారు.

అమ్మభాష పరిరక్షణ అందరి బాధ్యత


గాంధీ పార్కులో తెలుగు తల్లి విగ్రహానికి పూలమాల సమర్పిస్తున్న కవులు, రచయితలు

ప్రొద్దుటూరు కల్చరల్ : అమ్మభాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు తల్లి విగ్రహానికి కవులు, రచయితలు, తెలుగుభాషాభిమానులు పూలమాల సమర్పించారు. ఈ సందర్భంగా జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభుత్వం తెలుగు భాష అభివృద్ధికి వెంటనే అధికార భాష సంఘాన్ని తెలుగు అకాడమీలను ఏర్పాటు చేయాలని కోరారు. గ్రంథాలయాలకు చైర్మన్లను నియమించాలని, రచయితల పుస్తకాలు కొనుగోలు చేయాలన్నారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని కడపలో నెలకొల్పాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికార భాషా సంఘం పూర్వ సభ్యుడు తవ్వా వెంకటయ్య, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ, ఆరవేటి రాజా, కాశీవరపు వెంకటసుబ్బయ్య, కొత్తపల్లె శ్రీను, కంబం పాములేటి, సహదేవుడు, నాగమల్ల శివప్రసాద్, కాలే దేవానంద్, తవ్వా సురేష్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు సాయం ఇలాగేనా..?


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు : సబ్సిడీ రుణాలు ఇస్తామని ప్రకటించి ప్రభుత్వం నిరుద్యోగులకు మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు, కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రన్న స్వయం ఉపాధి పథకం ద్వారా ఆర్భాటంగా ప్రభుత్వం ప్రకటనలు చేసిందన్నారు. 164 యూనిట్లకు 3,600 మంది దరఖాస్తు చేయడాన్ని బట్టి నిరుద్యోగుల సంఖ్య ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. జిల్లాలోని పెద్ద మున్సిపాలిటీగా ఉన్న ప్రొద్దుటూరుకు ఈ రుణాలు ఏమాత్రం సరిపోవన్నారు. సబ్సిడీ రుణాల మంజూరులో లంచగొండితనం, పక్షపాత ధోరణి, దళారీ వ్యవస్థ స్పష్టంగా కనిపించిందన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి సిఫారసు చేసిన వారికే రుణాలు మంజూరయ్యాయన్నారు. 3 లక్షల జనాభాకు 164 యూనిట్లు ఇవ్వడం సరైన విధానం కాదన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ మాట్లాడుతూ లక్షా 30వేలు జనాభా ఉన్న మండలానికి సంబంధించి కేవలం 112 యూనిట్లు మంజూరు చేశారని, వీటి కోసం 1,342 మంది దరఖాస్తు చేశారన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలకే ఈ రుణాలు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్ నూకా నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గుద్దేటి రాజాంరెడ్డి, చేనేత విభాగం నియోజకవర్గం కన్వీనర్ చౌడం రవిచంద్ర పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రొద్దుటూరు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్స్ యూనియన్ ఆధ్వర్యంలో బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బ్యాంకు ఉద్యోగల కోఆర్డినేషన్ కమిటీ నాయకులు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రత్యక్ష నియామకాలను చేపట్టాలని, ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ విధానాన్ని నిలిపివేయాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, బ్యాంకుల్లో పని ఒత్తిడికి సరిపోయేలా నియామకాలను చేపట్టాలన్నారు. పని ప్రదేశాల్లో ఉద్యోగులకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వ రంగ బ్యాంకులను మరింత పటిష్టం చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం మార్చి 3న పార్లమెంట్ ఎదుట ధర్నా, మార్చి 24, 25 తేదీల్లో దేశ వ్యాప్తంగా సమ్మెలో అన్ని బ్యాంకుల ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు బ్యాంక్ ఉద్యోగుల కోఆర్డినేషన్ కమిటీ ప్రెసిడెంట్ పవన్‌కుమార్, కన్వీనర్ సంజీవ్, సెక్రటరీ సుధాకర్, నాయకులు ప్రవీణ్, గంగాధర్, రాధమ్మ, అన్ని ప్రభుత్వ రంగ బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

భూత వాహనంపై భద్రకాళి సమేత వీరభద్రస్వామి


ఊరేగుతున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి

చాపాడు : అల్లాడుపల్లె వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం రాత్రి భద్రకాళి సమేత వీరభద్రస్వామి భూత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున ఐదు గంటలకు సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, సహస్రనామార్చన, గణపతి, నవగ్రహ, రుద్ర, దేవిసూక్త హోమాలు నిర్వహించి బలిహరణ జరిపారు. సాయంత్రం 5 గంటల నుంచి బలిహరణ, వాహన సేవ(భూతవాహనం), గణపతి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, చండీశ్వరస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, త్రిశూలేశ్వర స్వామి పంచమూర్తి ఉత్సవం మూడు గంటల పాటు ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈఓ శ్రీనివాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు వీరనారాయణ యాదవ్‌సభ్యులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి


బద్వేలు : ఎమ్మెల్సీ జన్మదిన వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : నియోజకవర్గ అభివృద్ధికి , పార్టీ నాయకుల, కార్యకర్తల సంక్షేమానికి ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విశేష కృషి చేస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక మైదుకూరు రోడ్డులో మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనర్ యద్దారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సుధ, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళ రాజగోపాల్‌రెడ్డిలు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ గురుమోహన్, వైస్ చైర్మన్లు గోపాలస్వామి, సాయిక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నగర విభాగం రాష్ట్ర అధ్యక్షులు బంగారుశీనయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, ఆయా వార్డుల కౌన్సిలర్లు చెన్నయ్య, వెంకటేశ్వర్లు, సత్యం, హసన్, ఇన్‌చార్జిలు శివయ్య, చెన్నకృష్ణారెడ్డి, వీరనారాయణరెడ్డి, నాగేశ్వర్‌రావు, బిజ్జంరమణ, అనిల్, నారాయణరెడ్డి, రవిచంద్రారెడ్డి, రఘురామిరెడ్డి, మౌలాలి, షఫి, శ్రీనివాసులనాయుడు, రామచంద్రనాయుడు, సుబ్బరాజ, ఎస్సీ సెల్ నాయకులు నారాయణ, డాక్టర్ శ్రీను, కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన అభిమానం

పోరుమామిళ్ల : ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తెల్లవారుజామునుండే ఆయనకు శుభాకాంక్షలు తెలిపేందుకు పోటెత్తారు. పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో ఆయనతో కేక్ కట్ చేయించారు. గోవిందరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, యువనేత ఆదిత్యారెడ్డి, నియోజకవర్గంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, పార్టీలో వివిధ పదవుల్లో ఉన్నవారు, జిల్లా, మండలస్థాయి నాయకులు, తాజా, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, చైర్మెన్లు, డైరెక్టర్లు, కౌన్సిలర్లు, మండల కన్వీనర్లు, బూతు కమిటీ కన్వీనర్లు, అనుబంధ సంఘాల నాయకులు, వార్డు మెంబర్లు భారీగా తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ జన్మదినాన్ని పురస్కరించుకొని డీసీ యువసేన ఆధ్వర్యంలో దాదాపు వందమంది రక్తదానం చేశారు. ముందుగా యువనేత ఆదిత్యారెడ్డి రక్తదానం చేశారు.

అట్లూరు : బద్వేలు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనరు ముడమాల ప్రభాకర్‌రెడ్డి, డీఎల్డీఏ చైర్మన్ రొండా మాధవరెడ్డి, అటవీశాఖ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు రొండా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శి అందూరు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధిలోని రెడ్డిపల్లి పోలేరమ్మ ఆలయంలో ముందుగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈకార్య క్రమంలో మాజీ సర్పంచు లక్ష్మీనరసారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బోవిళ్ల చిన్న సూరారెడ్డి, పొన్నపలు బ్రహ్మానందరెడ్డి, రాజారెడ్డి, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలసపాడు : వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అంకనగురివిరెడ్డి, సూదా రామకృష్ణారెడ్డి, చిత్తా రాజశేఖర్‌రెడ్డి, సుదర్శన్, నారాయణయాదవ్ తదితరులు శుక్రవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు ఎ.వి.భాస్కర్‌రెడ్డి, తెల్లపాడు మాజీ సర్పంచ్ కె.రమణారెడ్డి, సింగరయ్య, జి.సుధాకర్‌రెడ్డి, రాంబాబు, విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన : ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


పోరుమామిళ్ల : శిబిరంలో రక్తం ఇస్తున్న యువనేత ఆదిత్యారెడ్డి


అట్లూరు : ఎమ్మెల్సీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఎట్టకేలకు ఫ్లెక్సీల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

బద్వేలు అర్బన్ : పట్టణ పరిధిలోని ప్రధాన కూడళ్లు, డివైడర్ల మధ్యలోని సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఎటువంటి అనుమతులు లేకుండా కూటమి నేతలు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను శుక్రవారం ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు తొలగించారు. ఇటీవల సాక్షి దినపత్రికలో 'ప్రచార యావ ... ప్రమాదాలకు తోవ' అనే శీర్షికతో వెలువడిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. అదే రోజు సంబంధిత ప్రకటనదారులకు పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో నోటీసులు సైతం ఇప్పించారు. అయితే కూటమి నేతలు అధికారుల నోటీసులకు స్పందించకుండా ఫ్లెక్సీలను తొలగించకుండా అలాగే ఉంచారు. దీంతో మున్సిపల్ అధికారులు సిబ్బందితో మైదుకూరు రోడ్డు, సిద్దవటం రోడ్డులలో డివైడర్ల మధ్యలో సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో సెంట్రల్ లైటింగ్‌లకు ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుద్దీపాలతో పట్టణం సుందరంగా కనిపిస్తోంది.


సెంట్రల్ లైటింగ్ స్తంభాలకు ఫ్లెక్సీలు తొలగించిన తర్వాత ఇలా...